

# కథా కౌముది

## నాన్న

కె.అరుణకాంతి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

"అందరూ ఇక్కడే ఉన్నారా! అరే మామ్మగారూ మీరు వంటగదిలోనా ? అందులోనూ గారెలు వేస్తున్నారే?" నేరుగా వంటగదిలోకి రాబోతున్న రాధ అక్కడ ఉన్న ఆ సందడి వాతావరణం చూసి సంభ్రమంగా నిలబడిపోయింది. జరీ అంచు చీర కొంగును లోపల దోపుకుని గారెలు వేస్తున్నారావిడ. వేగిన గారెలను చిల్లుల గరిటలతో తీసి పక్కన ఉన్న గిన్నెలో వేస్తోంది ఆమె కోడలు. ఆ పక్కన పాలరాతి గట్టుమీద కూర్చుని ప్లేట్లో గారెలు తింటున్నాడు కొడుకు మురళి. ఆ పక్కనే కబుర్లు చెబుతూ తన స్నేహితురాలు బిందు. ముచ్చటగా ఉంది వాళ్ళందరినీ కలిపి అక్కడ చూస్తుంటే రాధకు.

" రావే రాధా ఎక్కడే మీ నానమ్మ? పొద్దున్ననగా పప్పు నానబోసి వెళ్ళింది గారెలు వేస్తానని. ఇప్పటివరకూ అజా పజా లేదు. ఇంటికి వచ్చినవాళ్ళకి ఏం పెట్టమంటావు మరి?" మామ్మగారి కంఠం లో తెచ్చిపెట్టుకున్న గంభీరత తప్ప కోపం లేదు.

"అన్నపూర్ణమ్మగారూ వాళ్ళూ కూతురింటికి అమెరికా వెళ్తున్నారట. పిండి వంటలు చేయాలంటేనూ అటు వెళ్ళింది నాన్నమ్మ. లేటయినా సరే సాయంత్రం వంటకు వచ్చేస్తానని చెప్పిరమ్మంది. ఈరోజు మీ చేతి గారెలు తినాలని రాసిపెట్టి ఉంది మామ్మగారూ !" చనువుగా ఆవిడ పక్కకి వచ్చి ఒక గారే తీసుకుని నోట్లో పెట్టుకుంటూ చెప్పింది రాధ.

“ అక్కడ అంత చేసి మళ్ళీ సాయంత్రం ఇక్కడికి వస్తుందా మీ నానమ్మ. కాస్త వంటేగా నే చూసుకుంటాలే” అంది మమ్మగారి కోడలు.

మంచితనమే రూపుదాల్చి ఈ ఇంటి మనుషులయ్యారా అనిపిస్తుంటుంది రాధకెప్పుడూ..

చిన్ననాటి నుంచీ తానూ ఈ ఇంటి మనిషిలానే పెరిగింది.. నాన్నమ్మ వంట చేయడానికి వస్తూ తనను కూడా తీసుకొచ్చేది ఇంట్లో చూసుకునే వాళ్ళు ఎవరూ లేకపోవడంతో. మామ్మగారి మనవరాలు ‘బిందు’ తన వేయసుదే . ఇద్దరూ ఆడుకునేవారు. ఎన్నడూ ఎవరూ వేరుగా చూడలేదు ఎప్పుడూ. మురళి అంకులైతే ఈ నాటి వరకూ తన చదువుకు అయ్యే ఖర్చు ఆయనే భరిస్తున్నారు.

★★★

ఈ ఇల్లన్నా ఈ ఇంటి మనుష్యులన్నా ఎంతో కృతజ్ఞత రాధకు. కనీసం రోజులో ఒక్కసారైనా వచ్చి అందరినీ చూసి పలకరించకపోతే బావుండదు. కరోనా పుణ్యమా అని ఆన్లైన్ క్లాసుల వల్ల ఇక్కడ ఉన్న వైఫై ని తాను కూడా ఉపయోగించుకుంటూ బిందూతో కలసి చదువుకుంటోంది.

మామ్మగారు వేడిగా ఉన్న గారెల ప్లేటు బిందూ చేతికి ఇచ్చి “మీ పెదనాన్నకిచ్చిరా “ అంది .

“అమ్మో పెదనాన్నకా నా వల్లకాదు బాబూ!.. నా పుస్తకాలు తీసుకుందామని ఆ గదిలోకెళితే కయ్యిమన్నట్లు చూశారు. నేవెళ్ళను. రావే రాధా ఇకపై మన చదువు మేడమీద గదిలో. మన గది మా పెదనన్నకిచ్చేశాం.” చెప్పింది బిందు .

“ఏమిటే ఈ హడావిడి ఎవరొచ్చారు చుట్టాలు?” బిందూననుసరిస్తూ అంది రాధ.

“చుట్టాలంటే మా పెదనాన్న ‘రామకృష్ణ’. నిన్న వచ్చారు. కొన్నాళ్ళుంటారిక్కడ” ‘ ష్!’ అని మాట్లాడవద్దని హెచ్చరిస్తూ మెట్లెక్కుతూ కిటికీలో కనిపించిన వ్యక్తిని చూపించింది.

పక్కనుంచి అతని ముఖం తెలుస్తోంది. ఒత్తైన నొక్కుల జుట్టు గాలికి నుదుటపై పడుతోంది. ఏ మాత్రం ఏకాగ్రత చెదరిపోకుండా రాసుకుంటున్నాడతను.

“చిన్నప్పటి నుంచీ మీరంతా తెలుసు. దాదాపు మీ చుట్టాలంతా తెలుసు. ఈ పెదనాన్నని ఎప్పుడూ చూడలేదే ?”

“ నువ్వు చూడటం సంగతి సరే నేనే ఎప్పుడూ చూడలేదు. నేను పుట్టకముందు అంటే తాతగారు కాలం చేసినప్పుడు వచ్చారంట. ఊటీ లో ఓ కాలేజీలో పని చేస్తున్నారు. ఇంగ్లీషు పత్రికలకు ఆర్టికల్స్ కూడా రాస్తారట. ఎవరితో ఎక్కువ మాట్లాడరు. అక్కడ కాలేజీలోనే ఓ చిన్నగదిలో ఉంటారు. ఎక్కడికీ రారు. అదొరకం మనిషి. “

" మరి మీ పెద్దమ్మ?"

"ఆయన పెళ్ళే చేసుకోలేదు" చెప్పింది బిందు.

ఇంటికి వెళ్లిపోతూ తిరిగి కిటికీ దగ్గరగా వచ్చి గమనించింది. ఏదో పుస్తకం చదువుకుంటున్నాడతను. దగ్గర దగ్గర అరవైయ్యేళ్లు ఉంటాయేమో, జుట్టు అక్కడక్కడా నెరిసి ఉంది. అక్కడ వ్రాసుకుని పక్కన పెట్టిఉన్న ఆ పేజీలలో ఏముందో తెలియడం లేదు కానీ అవి చూడగానే రాధ కళ్ళల్లో వింత కాంతి.

★★★

"ఏమిటి కిటికీలోంచి రోజూ నన్ను గమనిస్తోంది నువ్వేనా?"

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ గదిలోకి అడుగుపెట్టబోతున్న రాధకు చటుక్కున రామకృష్ణ వెనుకకు తిరుగుతాడని ఊహించలేదు. ఆ కళ్ళల్లో తీవ్రతకు అక్కడే ఆగిపోయింది.

చూస్తున్నాడతను ఆ పిల్లను. పదిహేను పదహారు సంవత్సరాల వయసు, బక్క పలచగా పెద్ద పెద్ద బెదురు కళ్ళతో నిలబడి ఉంది.

"ఇలా గదిలోకి వచ్చేటప్పుడు కనీసం అనుమతి తీసుకోవాలని తెలియదా?" అతని గొంతులో విసుగు.

"అయ్యో సారీ అండీ ! తలుపు తెరిచే ఉందని వచ్చేశాను. నేను బిందూ స్నేహితురాలు రాధని. ఈ ఇంటికి ఎదురుగా ఉండే సందులోనే మేం ఉండేది. మా నానమ్మ ఇక్కడ వంట చేస్తుంది." ఉత్సాహంగా చెబుతోంది రాధ . ఏమీ వినలేదు రామకృష్ణ. పుస్తకంలో తలదూర్చేశాడు.

ఏమైనా మాట్లాడతాడేమోనని కాసేపు చూసి బిందూ దగ్గరకు వెళ్ళిపోయింది రాధ.

★★★

"ఏమిటే మా పెదనాన్న గదిలోకి వెళ్ళావా? మాట్లాడావా? ఆయన వచ్చి పదిరోజులైనా నేనే ఇప్పటివరకూ మాట్లాడలేదు. నీకెందుకే అంత ఆసక్తి? " ఆశ్చర్యంగా అడుగుతోంది బిందు.

"ఆసక్తి కాదే ! మనుషులతో కాకుండా పుస్తకాలతో గడిపే మనిషి ఎలా ఉంటారో? ఏం మాట్లాడతారో? తెలుసుకోవాలని అంతే!"

"జాగ్రత్త! ఆయన మానాన్నలా ఫ్రీగా ఉండరు. ఆయనకు బంధువులూ స్నేహితులూ ఎవరూ ఇష్టం ఉండదు. ఎవ్వరితో కల్పించుకుని మాట్లాడరు. మనం చెప్పినా వినరు. అవన్నీ అనవసర విషయాలు ఆయనకు. నాన్న ఎప్పుడైనా ఆయన గదిలోకి వెళితే 'ఇది నా చదువుకునే టైమ్' అంటూ మొహమాటం లేకుండా చెప్పేస్తారు."

"చిన్నప్పటినుంచీ ఇంతేనంటావా?" అమాయకంగా అడిగినది రాధ .

"ఏమో నాకు తెలీదు. ఆయన నాన్న కంటే చాలా పెద్దవారు. ఎక్కువగా హాస్టల్ లో ఉండే చదువుకున్నారట. ఎంతో చదువు. ఎన్నో డిగ్రీలు. ఇంకా ఏదో చదువుతూనే ఉంటారు .."

ఆయనంటే మరింత ఆసక్తి పెరిగిపోయింది రాధకు.

★★★

"నేను లోపలికి రావొచ్చా?" రెండడుగులు లోపలికి వేసి భయంతో మళ్ళీ వెనుకకు వెళ్లి అడిగింది రాధ.

పుస్తకం చదువుకుంటున్న రామకృష్ణ వెనుకకు తిరిగి చూశాడు. ఆ ముఖంలో ప్రశాంతతను చూసి తనే ముందుకొచ్చేసింది. మొన్నొకరోజు రామకృష్ణ గదిలో కనిపించకపోవడంతో నేరుగా లోపలికి వచ్చి టేబల్ మీద కాగితాలు తీసి చేతితో తడిమి చూసుకుంది రాధ. ఎందుకో ఆ అక్షరాలు కట్టిపడేస్తున్నాయి. హటాత్తుగా రామకృష్ణ బాత్రూంలోనుంచి వచ్చి ఇంకెప్పుడూ ఇలా ముట్టుకోవద్దు అని తీవ్రంగా హెచ్చరించాడు . ఆ సంఘటన తరువాత ఇదే రావడం

"అసలు ఏమిటి నీ సమస్య? నన్నెందుకు ఇలా విసిగిస్తున్నావు?"

"విసిగిస్తున్నానా ? నేనా?.. చూస్తున్నానంతే !"

ఏమిటన్నట్లు చూశాడు రామకృష్ణ.

"మా నాన్న చేతిరాత కూడా ఇలానే ఉండేది. అచ్చంగా ఇలానే గుండ్రంగా, ప్రింటులా.. మా నాన్నవి చిన్నప్పటివి రెండు పుస్తకాలు దాచుకున్నాను. రేపు మీకు తెచ్చి చూపించనా?"

"నాకెందుకు చూపించడం?" అతని కంఠంలో విసుగు.

"ఎందుకా ? ఏమో మీకు చూపించాలనిపిస్తుంది అందుకే" నవ్వింది రాధ. ఇంకా అక్కడనుంచి కదలకపోవడం చూసి తలెత్తాడు రామకృష్ణ .

"మరే.. మరే.. మిమ్మల్ని నేను నాన్న అని పిలవనా?"

"ఏమిటీ?"..

పరిగెత్తుకుంటూ బయటకు వచ్చేసింది రాధ.

బయట హాల్లో తల్లీ కొడుకులు ఆశ్చర్యంతో విన్నారు రాధ మాటలనని .

"ఇదేం పిచ్చిరా 'నాన్న' అంటుందేమిటి? అందులోనూ వీడిని."

"అమ్మా .. రాధ తల్లిదండ్రులు లేని పిల్ల. అన్నయ్యను చూడగానే అలా పిలవాలని అనిపించి ఉంటుంది. ఆ స్వచ్ఛమైన పసిమనస్సు పిలిచే పిలుపుకు కులాలూ అంతస్తులు అంటగట్టి చూడకు " మురళి చెప్పాడు తల్లితో

"నీమొహం అందుక్కాదురా ! అది చిన్నప్పటి నుంచీ మన కళ్ళముందు పెరిగింది. నిన్ను నాన్నా అని పిలిస్తే ఆశ్చర్యం ఉండేది కాదు నాకు . ఇప్పుడొచ్చినవాడిని నాన్నేమిటా?" అని ఆశ్చర్యంతో అంది మమ్మగారు.

హాయిగా నవ్వేశాడు మురళి " కారణం లేకుండా ఏదీ జరగదని నువ్వే చెవుతావు కదమ్మా చూద్దాం"

★★★

"అసలు మా పెదనాన్న నీకు నాన్నేమిటే?"

డాబాపై పిట్టగోడకానుకుని కూర్చుని ఉంది బిందు. ఆమె ముందు పుస్తకాలు ఉన్నాయి. పైకి పాకిన సన్నజాజి తీగలకు గుత్తులు గుత్తులుగా మొగ్గలు సాయంత్రం కావడంతో విచ్చుకుని పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. కొన్ని మొగ్గలను జాగ్రత్తగా త్రుంచి తెరచి ఉన్న పుస్తకంపై పోస్తోంది రాధ.

"సమాధానం చెప్పవేమిటే? మా పెదనాన్న వేయసెంతో తెలుసా? వచ్చే సంవత్సరం రిటైరవ్వుతారు.. రాత్రి అమ్మకు నానమ్మ చెబుతుంటే విన్నాను. పెదనాన్న చిన్నప్పుడు తోటి పిల్లలతో ఎక్కువగా ఆడుకునే వారు కాదుట. నానమ్మ కొంగు వదలకుండా ఉండేవారట. పెదనన్నకు నాలుగైదేళ్లు ఉన్నప్పుడు నాన్నమ్మకు ప్రాణం మీదకు వచ్చే సుస్తీ చేస్తే, పిల్లడిని చూసుకోవడానికి వీలులేక, పైగా అందరితో కలసి పెరగడం కూడా అలవాటవుతుందని ఊటీ కాన్వెంటులో చేర్చారట. పాపం తల్లి మీద బెంగ , అక్కడ కూడా ఎవ్వరితోనూ కలిసేవాడు కాదట. నెమ్మదిగా ఆ లోటును పుస్తకాలవైపు మళ్లించుకున్నారు. తరువాత ఇంటికి తీసుకువద్దామన్నా ఇష్టపడేవారు కాదుట. బలవంతంగా తీసుకొచ్చినా గదిలోనే, పుస్తకాలతోనే కాలక్షేపం. ఉన్న ఒక్క పిల్లాడు ఇలా ఉన్నాడని నానమ్మ తాతయ్యలకు చాలా బెంగగా ఉండేదట. పెదనాన్న పుట్టిన పదిహేనేళ్ళ తర్వాతనే నాన్న కడుపునపడ్డారట . డిగ్రీ తర్వాత పెదనాన్న ఇంటివైపే చూడలేదు. అతని మేధస్సుచూసి కాలేజీ వాళ్ళే ఉద్యోగం ఇచ్చారట. పెదనాన్న రాసిన ఎన్నో ఆర్టికల్స్ కాలేజీ విద్యార్థులకు పాఠ్యాంశాలు. " సుకుమారంగా ఉన్న ఆ మొగ్గలను మరింత సున్నితంగా చేతితో తాకుతూ వింటోంది రాధ.

★★★

"చూశారా నాన్నా నేచెప్పలేదూ! అచ్చంగా ఒకేలా లేదూ! మీ ఇద్దరి దస్తూరీ"

వచ్చినప్పటి నుంచీ ఆ పిల్లనే గమనిస్తున్నాడు రామకృష్ణ. అనుమతి లేకుండా గదిలోకి వచ్చేసింది. చనువుగా పక్కనే కూర్చుంది. తెచ్చిన పుస్తకం చూపిస్తోంది. మాటకు ముందు ఒక నాన్న , తర్వాత ఒకనాన్న. కొత్తగా

పలుకుతున్నట్లు లేదు. అది పదవతరగతి  సైన్స్ నోటుపుస్తకం. అట్ట నలిగిపోయి చినిగి ఉంది. పోలికని కాదు కానీ అక్షరాలు పొందికగా గుండ్రంగా ఉన్నాయి.

"అక్షరాలు ఒకేలా ఉంటే నాన్నైపోతానా? చాలా మంది ఇలానే రాస్తారు. ఈ బంధాలేమీ వద్దనే కదా దూరంగా ఉండిపోయింది."

"అక్షరాలే కాదు నాన్నా ఇంకా ఉన్నాయి. అసలు నేను మీలో ముందు చూసింది మీ జుట్టు. మా నాన్నకు కూడా మీకులానే ఒత్తైన నొక్కుల జుట్టు. చిన్నప్పటి నుంచీ ఆ జుట్టుతో ఆదుకోవడం నాకెంతో ఇష్టం. మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడు అచ్చంగా  మీది మానాన్న జుట్టే అనిపించింది. తను కారు డ్రైవరు. నాన్న పనిలోకి వెళ్ళేటప్పుడు నూనె రాసి తల దువ్వుతూ ఆడుకునేదాన్ని. ఐదేళ్లక్రితం ఆక్సిడెంట్ లో దూరమైపోయాడు. అమ్మ నాకు చిన్నప్పుడే లేదు." రాధ కళ్ళల్లో నీటిపోర. ఏం మాట్లాడాలో అర్ధంకాలేదు రామకృష్ణకు.

"కొంచెం ప్రాక్టికలే గా ఆలోచినచడం నేర్చుకో" అన్నాడు ముఖంలో ఏ భావం లేకుండా పుస్తకాన్ని రాధకిస్తూ..

★★★

వర్క్ ఫ్రమ్ హోమ్. మనసు పనిమీద నిలవడం లేదు మురళికి. ఈరోజు అన్నగారు తిరిగి వెళ్లిపోయే రోజు. కొంత కాలంగా రామకృష్ణను ఒక్కసారి చూడాలని బ్రతిమాలుతోంది తల్లి. కరొనా సమయం ఇంకా భయపడిపోయిందామె  ముసలి తల్లి కోరికను ఎలా కాదనగలడు. ఎప్పటికప్పుడు కాలేజీ వాళ్ళతో సంప్రదించి అన్నగారి యోగక్షేమాలు కనుక్కుంటూనే ఉంటాడు . చివరికి తానే వెళ్లి , ఎవ్వరం  ఏ విధంగా ఇబ్బంది పెట్టమనీ, నచ్చకపోతే ఏ క్షణాన్నయినా వెళ్లిపోవచ్చనీ, ఎన్నో విధాలుగా నచ్చచెప్పి, మాట ఇచ్చి తీసుకు వచ్చాడు .

దాదాపు ఆరునెలలౌతొంది రామకృష్ణ వచ్చి. వచ్చినప్పటి నుంచీ అతనిలో మార్పు స్పష్టంగా తెలుస్తోంది మురళికి. అతనిని ఆశ్చర్యపరచిన మొదటి సంఘటన ఇంకా గుర్తుంది.

అన్నగారి గది గుమ్మం దగ్గర కూర్చుని లాప్టాప్ లో పని చేసుకుంటున్నాడు. వడివడిగా అడుగులు వేస్తూ మురళిని దాటుకుని నేరుగా రామకృష్ణ దగ్గరకు వెళ్ళింది రాధ.

" ప్రాక్టికల్ గా ఆలోచించడం అంటే ఏమిటి నాన్నా? నిన్నంతా ఆలోచించాను. నాకు అర్థం కాలేదు. మీరే చెప్పండి" చనువుగా పక్కన కూర్చుంది రాధ.

"నీకేలా చెబితే అర్థమవుతుంది .. ప్రాక్టికల్ గా ఆలోచించడం అంటే, ఉన్నది ఉన్నట్లు ఆలోచించడం. ప్రతీ విషయాన్నీ తర్కించి హేతుబద్ధంగా ఏది నిజం? ఏది నిజంకాదు? అని ఆలోచించడం. ఉదాహరణకి నువ్వు నన్ను 'నాన్న' అని పిలవడం ప్రాక్టికల్ గా ఉండటం కాదు. నేను మీనాన్నను ఎలా అవుతాను చెప్పు?" చెప్పాడు రామకృష్ణ .

" కానీ నాన్నా నేను మిమ్మల్ని అలా పిలవడం వలన సంతోషంగా ఉంటున్నాను కదా!."

"అదే చెప్పబోతున్నా ఇప్పుడు నన్ను పిలిచే ఈ పిలుపు తాత్కాలికమైన భావోద్వేగానికి సంబంధించినది. ఈ బంధాలు సమాప్తి చెందిన క్షణం బాధనే మిగులుతుంది"

"ఏమో బాబూ! అదంతా నాకు అర్థం కాదు. ఎప్పుడో బాధ కలుగుతుందని ఇప్పుడున్న సంతోషాన్నెందుకు దూరం చేసుకోవాలి నాన్నా?" రాధ వెళ్ళిపోయింది.

చదువుతున్న పుస్తకం పక్కనపడేసి ఆలోచనలో మునిగిపోయిన అన్నగారు ఆనాడు కొత్తగా కనిపించారు మురళికి .

తరువాత నాలుగు రోజులకు గానీ రాధ రాలేదు. రాధ నానమ్మకు కాస్త నలతగా ఉండటంతో ఆమెకు సాయంగా ఇంట్లోనే ఉండిపోయిందామె . విషయం తెలియని రామకృష్ణ రోజులో ఒకటి రెండు సార్లు వరండాలోకి వచ్చి రోడ్డు వైపు చూడటం గమనించాడు మురళి. అన్నయ్య మనుషుల్లోపడటం సంతోషించే విషయం కదూ!.

★★★

"నాన్నా అరిసెలు మీకిష్టమా? కాగితం చుట్టిన పొట్లాన్ని రామకృష్ణ ముందుంచింది నవ్వు ముఖంతో రాధ.

ఆమె రాక సంతోషానిచ్చినా బయటకు చూపించలేదతను.

"నానమ్మ చేసే ఈ అరిసెలు నాన్నకి ప్రాణం. మా నానమ్మ వంటలు అద్భుతంగా చేస్తుంది కదా నాన్నా !"

"నాకేలా తెలుసు?"

"మీకు తెలియదా? ఇక్కడ వంట చేసేది మా నానమ్మనే. మామ్మగారు మీకోసం ప్రత్యేకంగా చేయిస్తుంటేనూ! " ఆశ్చర్యపోతూ అడిగింది. రాధ.

"నే తినేది కేవలం ఆకలి తీరడం కోసం మాత్రమే, రుచికోసం కాదు."

"అదేలెండి నాన్నా ! మనకోసం ఎవరైనా ప్రేమగా చేసినా లేక చేయించినా ఎంత బావుంటుంది."

"చూడు రాధా ! ఎవ్వరు ఏ పని చేసినా అది కేవలం వారి సుఖం, ఆనందం కోసమే చేస్తారు. అందులో అంతర్లీనంగా ఒక స్వార్ధం తప్పకుండా ఉంటుంది. అది తల్లి ప్రేమైనా సరే! నువ్వింకా చిన్నపిల్లవు. నీకు లోతైన ఆలోచనలు అర్థం కావు."

ఒక్క క్షణం ఆలోచించింది రాధ.

" నాకొద్దు ఇలా ప్రాక్టికల్ గా ఆలోచించడం. నానమ్మ కష్టపడి నాన్నకోసమే చేసేది. అవి అంతే ఇష్టంగా నానమ్మకోసం నాన్న తినేవాడు. అంతే చాలు నాకు. మీరిన్ని ఆర్టికల్స్ రాస్తుంటారుగా అవి చదవడం చాలామందికి సంతోషం, ఉపయోగం కదా !"

"అది నాకు అవసరం లేదు. అవి కేవలం నా ఆనందం కోసమే రాసుకుంటున్నాను" రాధ మాటలకు అడ్డు చెప్పాడు.

" నిజంచెప్పండీ నాన్నా ఒకవేళ ఎవరూ చదవరు, ఎవరికీ ఉపయోగం లేదంటే మీకు రాయాలనిపించదు అవునా. అయినా ఎదుటివారికి సంతోషాన్నివ్వని పని చేస్తే ఎంత ? చేయకపోతే ఎంత?" చూస్తుండి పోయాడు రాధ వైపు. వయసుకి మించిన పరిణితి ఈ పిల్లలో ..

ఆ రాత్రి భోజనానికి అందరితో పాటూ టేబల్ దగ్గరకు వస్తే ఆశ్చర్యపోయారు అందరూ రామకృష్ణను చూసి. మౌనంగా తిని చివరిలో అక్కడ ఉన్న అరిసె ఒకటి తీసుకుని వెళ్ళిపోయాడు. దానికే పరమానందపడిపోయింది అతని తల్లి.

★★★

"నాన్నా.. ఎప్పుడు స్కూల్ మాగజైన్ కి వ్యాసం రాసినా అది సెలెక్ట్ అవ్వదు. టెన్త్ అయిపోతే ఈ స్కూల్ వదలి వెళ్లిపోతాను. ఈ సంవత్సరమైనా నా వ్యాసం సెలెక్ట్ అవ్వాలి. నాకు నేర్పిస్తారా సరిగ్గా ఎలా వ్రాయాలో?"

రామకృష్ణ కళ్ళల్లో చిరునవ్వు " మీరు ఏకాగ్రతతో రాసుకుంటుంటే పక్కనుంచి అచ్చంగా మా నాన్నని చూసినట్టే ఉంటుంది. ఎంత ఏకాగ్రతతో డ్రైవింగ్ చేసేవాడో . నాన్న ఎప్పుడూ తప్పుగా చేయడు. చేయలేదు కూడా. ఆరోజు కూడా ఎదురుగా వచ్చిన లారీదే తప్పు." వెక్కి వెక్కి ఏడుస్తోంది రాధ. అప్రయత్నంగా రామకృష్ణ చేయి రాధ తలమీద పడింది. ఒక్క క్షణం రామకృష్ణ భుజంపై తలవాల్చేసింది.

తరువాత తరువాత అ ఇంట్లో రామకృష్ణ చుట్టూ ఉండే గంభీరమైన వాతావరణం హాయిగా మారిపోయింది. స్కూల్ తెరిచేశారు. సాయంకాలాలు కలసి చదువుకునేవారు బిందూ, రాధ. సందేహాలుంటే రామకృష్ణను

అడిగేవారు. చెప్పేవాడతను. మామ్మగారు కూడా పక్కన కూర్చుని కొడుకు మాటలు మురిపెంగా వినేది. హాయిగా గడిచిపోతున్నాయి రోజులు.

“రిసెర్చ్ స్టూడెంట్స్ ఎవరికో నా సహాయం కావాలట. హాస్టల్, కాంటీన్ కూడా తెరిచేశారు. వెళ్ళడం తప్పనప్పుడు త్వరగా వెళ్లిపోవడమే మంచిది.” టికెట్ బుక్ చేయమని చెప్పాడు రామకృష్ణ మురళితో .

రిటైరయ్యిన తర్వాత అన్నగారిని శాశ్వతంగా తీసుకుని వచ్చేసే బాధ్యత తనదే అని తల్లికి సర్ది చెప్పాడు ఆ రాత్రి. కొంతకాలంగా ఆ తల్లి ఎంత సంతోషంగా తృప్తిగా ఉందో తనకు మాత్రమే తెలుసు. ఈ విషయంలో రాధకు ఎంత కృతజ్ఞత చెప్పిన తక్కువే . ఆ పిచ్చి పిల్ల రాధను ఎలా సమాధానపరచాలో? ఆలోచనలో పడ్డాడు మురళి.

★★★

గది లోపల సర్దుకుంటున్నాడు అన్నగారు. గది బయట పుస్తకాలతో నిండిన రెండు సూట్ కేసులు పెట్టి ఉన్నాయి. ఒకరి వెనుకాల ఒకరు పిల్లలు పరిగెత్తుకు వచ్చారు. రాధ ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఇంటికి వెళ్ళకుండా నేరుగా ఇక్కడికే వచ్చినట్లు చేతిలో పుస్తకాల సంచి ఉంది. లోపల ఉన్న రామకృష్ణనీ బయట ఉన్న లగేజీనీ, దిగాలుగా ఉన్న మామ్మగారిని చూడగానే అక్కడే నిలబడిపోయింది రాధ.

“నీ వ్యాసం సెలెక్ట్ అయ్యింది కదూ! నీ ముఖమే చెబుతోంది.” నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అడిగాడు మురళి రాధ మూడ్ మార్చడానికి. తలూపింది రాధ.

“అన్నయ్యను మళ్ళీ మనదగ్గర తీసుకొచ్చే బాధ్యత నాది సరేనా!”

“నేనేమీ బాధపడటం లేదు అంకుల్ మీరంతా అనుకున్నట్లు నేను మా నాన్నే ఈ నాన్న అనుకోవడం లేదు. మా నాన్నలోని కొన్ని లక్షణాలో లేక మా నాన్నకి ఉండాలీ అనుకునే లక్షణాలో రామకృష్ణ గారిలో చూశాను. అందుకే ‘నాన్న ‘ అని పిలిచాను. నాన్న రూపు దాల్చిన వ్యక్తి కాదు. వ్యక్తిత్వం. అది ఒక భావన. అందుకే ‘నాన్న’ నా నుంచి దూరంకాలేదు. ఆ నాన్నైనా... ఈ నాన్నైనా.!” ఆశ్చర్యంగా వింటున్నాడు మురళి. ఈ రాధనేనా? మాట్లాడేది. ఇంకా చిన్నపిల్లగా అనుకుంటున్నాడు. ఎంత పరిణితితో మాట్లాడుతోంది. ఈ అరునెలల్లో ఎంత మార్పు. అన్నగారి సహచర్యమా?

“అంకుల్ మన స్వభావాలు మార్చాలని నాన్న ప్రయత్నించలేదు కదా! కానీ మనమెందుకు ఆయన మారిపోవాలని కోరుకుంటున్నాం. ఆయన్ని ఆయనలానే ఉండానిద్దాం.”

రామకృష్ణ రాకతో మౌనంగా ఉండిపోయింది రాధ.

"రాధా!, బిందూ! మీ ఇద్దరికీ కొన్ని పుస్తకాలు గదిలో వదిలి వెళుతున్నాను. రాధా! నీకోసం ప్రత్యేకంగా కొన్ని వ్యాసాలు కూడా.. మంచి రచయిత్రివి కావాలి" రామకృష్ణ చేయి రాధ తలను నిమిరింది. పక్కనే ఉన్న బిందు తలమీద కూడా చేయివేశాడతను. కన్నీళ్లతో ఉన్న తల్లిని హృదయానికి హత్తుకున్నాడు. అతను చేస్తున్న ప్రతీ పనికీ ఆశ్చర్యంగా ఉంది మురళికి.

సాగనంపడానికి అందరూ బయటకు వచ్చారు. సామాన్లు లోపలపెట్టి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు మురళి. డోర్ తెరచిపట్టుకుంది రాధ.

"నేను నీకు నాన్ననా! బాధ్యత లేని నాన్నను కదూ!" రాధ నుదుటిమీద అతి సున్నితంగా పెదవులు తాకించి కార్ లో కూర్చున్నాడు రామకృష్ణ.

రామకృష్ణ కళ్ళజోడు మాటున చిన్న కన్నీటిపొర గుర్తించి సంతోషంగా కార్ స్టీరింగ్ పై చెయ్యివేశాడు మురళి.

*************

COMMENTS